క్లుప్తంగా

విద్యార్థికి మార్గదర్శి గురువే



శంకరయ్యను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

డోన్ టౌన్: విద్యార్థికి మార్గదర్శకుడు గురువే అని మండల విద్యాధికారి రామనర్సప్ప, యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి అన్నారు. ప్యాపిలి మండలం చిన్నపూదెళ్ల పాఠశాల హెచ్‌ఎంగా పనిచేసి పదవీ విరమణ పొందిన శంకరయ్యను ఆదివారం ఘనంగా సన్మానించారు. పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చౌడేశ్వరిదేవి ఆలయాభివృద్ధికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

బనగానపల్లె రూరల్: నందవరం చౌడేశ్వరిదేవి ఆలయాభివృద్ధికి నంద్యాలకు చెందిన నవోదయ కాంట్రాక్టర్ ఎం.రితేష్‌రెడ్డి కుటుంబ సభ్యులు రూ.25వేల విరాళం అందజేసినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ కుమార్ రెడ్డి ఆదివారం తెలిపారు. ఈ మేరకు దాతను సన్మానించి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేసినట్లు చెప్పారు.

జాయింట్ సెక్రటరీగా మహేశ్వరరెడ్డి



ప్యాపిలి: హుసేనాపురం సర్పంచ్ పాలెం మహేశ్వర్ రెడ్డిని పార్టీ రాష్ట్ర పంచాయతీరాజ్ వింగ్ జాయింట్ సెక్రటరీగా నియమించినట్లు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడైన మహేశ్వర్ రెడ్డి పార్టీ బలోపేతానికి తన వంతు చేస్తున్న కృషిని గుర్తిస్తూ పార్టీ ఈ నియామకం చేపట్టినట్లు సమాచారం. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, మాజీ ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తనపై ఉంచుకున్న నమ్మకాన్ని వమ్ముకాకుండా పార్టీ కోసం పని చేస్తానని మహేశ్వర్ రెడ్డి తెలిపారు.

టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందించాలి

డోన్ టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రారంభిస్తున్న టిడ్కో గృహాల్లో డోన్‌లోని గృహాలను కూడా ప్రారంభించి లబ్ధిదారులకు అందజేయాలని జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు ఏఈ నాగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ముక్తేశ్వర ఆలయంలో ఆయన మాట్లాడారు. కొన్నేళ్ల క్రితం టీడీపీ నాయకుడు కోర్టుకు వెళ్లడంతో డోన్ టిడ్కో గృహాలను పంపిణీకి బ్రేక్ పడిందని.. కూటమి నాయకులు చొరవ చూపి సమస్యలను పరిష్కరించాలన్నారు. గృహాలు నిరుపయోగంగా ఉండడంతో శిథిలావస్థకు చేరుకోవడంతో పాటు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయని తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



చంద్ర ఓబులేసు(ఫైల్)

కోవెలకుంట్ల: మండలంలోని జోళదరాశికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన చంద్ర ఓబులేసు అనే వ్యక్తి గత నెల 30వ తేదీ ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. ఈ మేరకు చంద్రఓబులేసు భార్య ప్రసన్న పోలీసులను ఆశ్రయించడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మట్టి వినాయకులనే పూజిద్దాం

బేతంచెర్ల: పర్యావరణ పరిరక్షణలో భాగంగా వినాయక చవితి నాడు మట్టి గణపయ్యలను ఏర్పాటు చేసుకుని పూజించాలని కేంద్ర గణేష్ ఉత్సవ సమితి సభ్యులు హుసేన్‌రెడ్డి, నాగరాజు, వీరారెడ్డి, మధు మోహన్‌రెడ్డి, హరి, రాఘవరెడ్డి, పుల్లారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని వికాస నిలయంలో పట్టణంలోని వినాయక మండపాల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ ఏడాది కేంద్ర గణేష్ ఉత్సవ సమితి నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. డీజేలకు స్వస్తి పలికి కోలాటం, సంప్రదాయ నృత్యాలు, చెక్కభజన, డప్పు వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించుకోవాలన్నారు.

జగ్జీవన్‌రామ్ ఆశయాలను నేరవేర్చుదాం

డోన్ టౌన్/బేతంచెర్ల: స్వాతంత్ర్య సమరయోధుడు, ఉపప్రధాని బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం డోన్, బేతంచెర్లలో ఆయన చిత్రపటం, విగ్రహానికి పలువురు నివాళులర్పించారు. వీరిలో మాల మహానాడు సంఘం నాయకులు మేకల నాగరాజు, రూబెన్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రామసుబ్బయ్య, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ మద్దిలేటి స్వామి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఉన్నిగోర్ల జనార్ధన్ ఉన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు



కొండపేటలో కొలువైన కాశీంవలిపీర్లు



కోవెలకుంట్లలో పీర్ల ఊరేగింపు

డోన్: మతసామరస్యానికి అద్దంపట్టేలా డోన్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మొహర్రం ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కుల, మత, వయస్సు తేడాలు లేకుండా చిన్నా, పెద్దా ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఉత్సవాల్లో భాగంగా కొందరు తమ ఇష్టదైవాలకు మొక్కుబడిగా కందూర్లు (జంతువులు) బలి ఇస్తుండగా, మరికొందరు ఫాతేహాలు, పూల షేర్వాలు, వెండి గొడుగులను బహూకరిస్తున్నారు. మరికొందరు ఆరాధనలో భాగంగా వేషధారణలతో ప్రజలను ఆకట్టుకుంటున్నారు. పక్కీర్లు నోటికి సూదులు గుచ్చుకొని ఒళ్లు గగుర్పొడిచే విన్యాసాలు చేస్తుండగా, మరికొందరు దేవతామూర్తుల వేషాలు, ఆడవేషధారణలతో నృత్యాలు చేస్తూ ప్రజలను అలరిస్తున్నారు. చిన్న, మధ్య, పెద్ద సరిగెత్తుల నాడు పీర్లచావిళ్ల ఎదుట ఏర్పాటు చేసిన అగ్నిగుండాల్లో స్వాముల వారు నడిచే ప్రత్యేక కార్యక్రమం ఈ ఏడాదీ కొనసాగింది. కొన్ని గ్రామాల్లో ఈ ఉత్సవాలు సోమవారం ముగియనుండగా, మరికొన్ని గ్రామాల్లో మంగళవారం ముగియనున్నాయి. శాంతియుత వాతావరణంలో కార్యక్రమాలు సాగేలా పోలీసు శాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు రాకేష్, ఇంతియాజ్‌బాషా, ఎస్‌లు పీర్లచావిళ్ల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

ముగిసిన మొహర్రం

కోవెలకుంట్ల: మతసామరస్యానికి ప్రతీకగా హిందూ–ముస్లింలు కలసి నిర్వహించే మొహర్రం ఉత్సవాలు ఆదివారం పీర్ల నిమజ్జనతో ముగిశాయి. పట్టణంలోని చిన్నబార్‌ఇమాం, పెద్దబార్‌ఇమాం, ఆంజనేయస్వామి దేవాలయం, రంగరాజుపేట, బాబానగర్, జెండామాను వీధి, సంతపేట, బసిరెడ్డి బావి వీధుల్లో పీర్లను కొలువుంచి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముగింపు రోజున బీబీ ఫాతిమా, ఇమాంకాశీం, అజరత్ అలీ అక్బర్, హజరత్ అబ్బాస్, దస్తగిరిస్వామి, మస్తాన్‌వలి, ఉద్దండ ఇమాంకాశీం తదితర పీర్లతో ఊరేగింపు నిర్వహించారు. సొదరదిన్నె గ్రామం నుంచి వచ్చిన బార్ ఇమాం కాశీం పీరును కూడా అమ్మవారి శాల మెయిన్ బజార్ వరకు ఊరేగించారు. మండలంలోని ఆయా గ్రామ శివారుల్లోని కుందూ నది, పాలేరు వాగుల్లో పీర్ల నిమజ్జనం చేశారు.

బేతంచెర్లలో..

బేతంచెర్ల: పట్టణంతో పాటు మండలంలోని బుగ్గానిపల్లె, సిమెంట్‌నగర్, బలపాలపల్లె, ఆర్‌ఎస్ రంగాపురం, అంబాపురం గ్రామాల్లో కొలువుంచిన పీర్లను చివరి రోజు ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. డప్పు వాయిద్యాలు, సాంస్కృతి కార్యక్రమాలు, యువకుల ఈలలు, కోలహలం నడుమ ఊరేగింపు సాగింది. ఆయా వీధులన్నీ కిక్కిరిసిపోయాయి.



బేతంచెర్ల: ఊరేగింపుగా వెళ్తున్న కోటపేట పీర్లు



బూరుగలలో కొలువుదీరిన పీర్లు



సంజామలలో పీర్ల ఊరేగింపు

ఘనంగా పీర్ల ఊరేగింపు

సంజామల: మండల కేంద్రం సంజామలలో చివరి రోజు ఆదివారం పీర్ల దేవుళ్లను ఘనంగా ఊరేగించారు. జనం భారీగా తరలిరావడంతో వీధులన్నీ కిటకిటలాడాయి. యువకులు డప్పు వాయిద్యాలకు చిందులు వేశారు. పీర్ల నిమర్జనం అనంతరం పీర్ల పెట్టెలను ఆయా చావిళ్లలో ఉంచారు. ఆకుమల్ల, ముదిగేడు గ్రామాల్లో పెద్ద సరిగెత్తు నిర్వహించారు. భక్తులు పీర్లదేవుళ్లకు ఫాతేహాలు సమర్పించారు. సోమవారం ఆ రెండు గ్రామాల్లో పీర్ల నిమజ్జనం చేయనున్నారు.

ఘనంగా మొహర్రం వేడుకలు

ప్యాపిలి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. పెద్ద సరిగెత్తు సందర్భంగా ఆయా గ్రామాల్లోని పీర్ల చావిళ్లలో కొలువు తీరిన పీర్ల స్వాములను భక్తులు దర్శించుకున్నారు. పీర్ల చావిళ్ల ముందు ఏర్పాటు చేసిన గుండంలో పెద్ద ఎత్తున మంటలు వేశారు. పీర్ల స్వాములు గుండంలో నిప్పుల మీదుగా నడిచిన దృశ్యాలను భక్తులు ఆసక్తితో తిలకించారు. యువకులు విచిత్ర వేషాలతో సందడి చేశారు.

శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో శ్రమదానం

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థులు, యువకులు, చిన్నారులు శ్రమదానం చేశారు. ఇటీవల వర్షాల కారణంగా పాఠశాల ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలను తొలగించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని తమ సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. ఆటల కోసం వచ్చిన విద్యార్థులు కూడా స్వచ్ఛందంగా పాల్గొని తమ బాధ్యతను నిర్వర్తించారు. ఫలితంగా పాఠశాల మైదానం సౌకర్యవంతంగా మారింది. కార్యక్రమంలో ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, పట్టణ ప్రముఖులు బుగ్గన చంద్రారెడ్డి, ముర్తుజా వలి, నాగరాజు, రామచంద్రుడు, పిట్టల జాకీర్, తిరుమలేశ్వర రెడ్డి, మధుసూదన రెడ్డి, హరి, భాస్కర్, ఖాజా, సలీం తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న పూర్వ విద్యార్థులు

తీర్థ కలశాలతో యాగంటి క్షేత్రానికి పాదయాత్ర



కలశాలతో యాగంటి క్షేత్రానికి పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

బనగానపల్లె రూరల్: తొలి ఏకాదశి సందర్భంగా బనగానపల్లె మండలంలోని శ్రీహట్టిమునిస్వామి దేవస్థానం నుంచి యాగంటి క్షేత్రానికి ఆదివారం భక్తిశ్రద్ధలతో పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విశ్వహిందూ పరిషత్, హట్టిమునిస్వామి దేవస్థానం, గీతా భజన భక్త మండలి సంయుక్తంగా నిర్వహించాయి. ముందుగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు తీర్థ కలశాలను తలపై పెట్టుకుని రవ్వలకొండపై వెలసిన హట్టిమునిస్వామి ఆలయానికి చేరుకున్నారు. అక్కడ పూజలు నిర్వహించిన అనంతరం భక్తులు శివనామస్మరణలతో చక్రవర్తి ఫంక్షన్‌హాల్, సుంకులమ్మగుడి, పొట్టి శ్రీరాముల విగ్రహం, పెట్రోల్‌బంకు, యాగంటిపల్లె, పాతపాడు గ్రామాల మీదుగా పాదయాత్రగా యాగంటి క్షేత్రానికి చేరుకున్నారు. యాగంటి ఆలయంలో ఏకశిలారూపంలో కొలువైన ఉమామహేశ్వరస్వామికి తీర్థ కలశాలతో అభిషేకం, అర్చన తదితర విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ సంఘటనా కార్యదర్శి దొంతా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..దేశంలో అన్ని వర్గాల ప్రజలు, రైతులు సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతో పాదయాత్ర చేసి ఉమామహేశ్వరునికి పూజలు చేసినట్లు తెలిపారు. అనంతరం ఉమామహేశ్వర స్వామి నిత్య అన్నదాన సంస్థ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

కుక్కలకు రేబిస్ వ్యాధినిరోధక టీకాలు





డోన్‌లో కుక్కకు యాంటి రేబిస్ టీకా వస్తున్న నాగరాజు, బేతంచెర్లలో కుక్కకు టీకా వేస్తున్న వైద్యుడు

డోన్: జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు సంక్రమించే వ్యాధులను జునోటిక్ వ్యాధులుగా పిలుస్తారని పశువైద్యశాఖ సంయుక్త సంచాలకుడు డాక్టర్ నాగరాజు తెలిపారు. ప్రపంచ జునోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలను వేశారు. మొత్తం 45 కుక్కలకు టీకాలు వేశామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పద్మావతి, గౌసియాబేగం, డాక్టర్ రాజ్యలక్ష్మి, మహమ్మద్ రఫి, నవ్య తదితరులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

స్థానిక జిల్లాపరిషత్ ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పెంపుడు జంతువులు, పక్షుల వల్ల సంక్రమించే వ్యాధులపై డాక్టర్ నాగరాజు విద్యార్థులకు అవగాహన కల్పించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

జంతువుల నుంచి వచ్చే వ్యాధులతో జాగ్రత్త

బేతంచెర్ల: జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు సంక్రమించే అవకాశముంటుందని.. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని వెటర్నరీ ఏడీ వసంత లక్ష్మీ, డాక్టర్ అజయ్ సూచించారు. ఆదివారం స్థానిక పశువైద్యశాలలో నిర్వహించిన ప్రపంచ జునోసిస్ దినోత్సవం కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 100 పెంపుడు కుక్కలకు ఉచితంగా రేబిస్ టీకాలు వేశారు. ఈ టీకాలను కర్ణాటక యాంటీబయోటిక్స్ కంపెనీ ఉచితంగా అందించిందని పేర్కొన్నారు. రేబిస్, బ్రూసెల్లోసిస్, ఆంత్రాక్స్, స్వైన్‌ఫ్లూ వంటి వ్యాధులు జంతువుల నుంచి మనుషులకు వ్యాపించే ప్రమాదకరమైన వ్యాధులుగా పేర్కొన్నారు. పశువుల ద్వారా వచ్చే వ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని, నివారణ చర్యలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఆయా ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ అనంతరావు తెలిపారు.

- అమడాల, గుంజలపాడు, జోళదరాశి, రేవనూరు ఫీడర్ల పరిధిలోని కోవెలకుంట్ల, భీమునిపాడు, బిజనవేముల, సొదరదిన్నె, కంపమల్ల గ్రామాలకు ఉదయం 7.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుంది.
- గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, అల్లూరు, కొత్తపల్లె ఫీడర్ల పరిధిలో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు..
- కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ ఉంటుంది.

సంజామలలో విద్యుత్ వేళలు

సంజామల: మండలంలో వ్యవసాయానికి సోమవారం నుంచి ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని ఇన్‌చార్జ్ ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. సంజామల, ఆకుమల్ల, పేరుసోముల, నొస్సం సబ్‌స్టేషన్ల పరిధిలోని ముక్కమల్ల, ఆల్వకొండ, రెడ్డిపల్లె, వసంతాపురం, కమలపూరి, ముదిగేడు, కానాల, అక్కంపల్లె, గిద్దలూరు, ఆర్.లింగందిన్నె, రామిరెడ్డిపల్లె, మిక్కినేనిపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఈ సమయాల్లో విద్యుత్ సరఫరా చేస్తామని పేర్కొన్నారు.

నేడు గుండె వైద్య శిబిరం

డోన్ టౌన్: పట్టణంలోని శ్రీవైష్ణవి హాస్పిటల్‌లో సోమవారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ రాఘవ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్నూలు కిమ్స్ ఆస్పత్రి వైద్యులు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. శిబిరంలో గుండెకు సంబంధించిన టూడీఈకో, ఇతర పరీక్షలు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఓపీ కోసం ఉదయం 9 గంటల లోపు 08516-295555 లేదా 63097 66163 నంబర్లను సంప్రదించాలన్నారు.

రేపు దివ్యాంగుల శిబిరం

కోవెలకుంట్ల: దివ్యాంగులకు అవసరమైన పరికరాలు అందజేసేందుకు లబ్ధిదారుల ఎంపికకు ఏర్పాటు చేసిన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ వరప్రసాద రావు తెలిపారు. దివ్యాంగులకు ఉచితంగా మూడు చక్రాల సైకిళ్లు, వీల్‌చైర్లు, చంక కర్రలు, బ్యాటరీతో నడిచే సైకిళ్లు, శ్రవణ, అంధుల చేతి కర్రలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ నెల 8వ తేదీ బనగానపల్లె మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో దివ్యాంగ శిబిరం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన దివ్యాంగులు ఆధార్, రేషన్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, సదరం సర్టిఫికెట్, దివ్యాంగత్వం కన్పించేలా మూడు ఫొటోలు, స్వావలంబన కార్డుతో శిబిరానికి హాజరు కావాలని సూచించారు.

ఘనంగా తొలి ఏకాదశి వేడుకలు





బేతంచెర్లలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు, విశేష అలంకరణలో దుర్గాపేట వేంకటేశ్వరస్వామి

బేతంచెర్ల: తొలి ఏకాదశిని బేతంచెర్ల మండల వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువ జామునే భక్తులు చన్నీటి స్నానాలు ఆచరించి సమీప దేవాలయాలకు తరలివెళ్లారు. చెన్నకేశవ స్వామి ఆలయంలో వెలసిన వేంకటేశ్వరస్వామి, ఆంజనేయ స్వామికి విశేష పూజలు నిర్వహించారు. అభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి వంటి కార్యక్రమాల్లో పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. బనగానపల్లె రహదారిలో ఉన్న పుట్ట పెద్దమ్మ ఆలయం వద్ద స్థానిక కాలనీలకు చెందిన భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే, సిమెంట్‌నగర్, ఎం.పేండేకల్లు, ఆర్‌ఎస్ రంగాపురం, బుగ్గానిపల్లె, ముద్దవరం గ్రామాల్లో ఉన్న సీతారామ, ఆంజనేయ స్వామి ఆలయాల్లో గ్రామస్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

మాన్యం.. వివాదం..!

- సిమెంట్ ఫ్యాక్టరీ లీజులో ఆలయ భూములు
- వాటి స్థానంలో ఇతర గ్రామంలో భూమి
- అభ్యంతరం వ్యక్తం చేస్తున్న కౌలు రైతులు

కొలిమిగుండ్ల: ఆలయాల్లో ధూపదీప నైవేద్యాలు, నిర్వహణ కోసం పూర్వమే దేవాలయాలకు భూములు కేటాయించారు. భూముల వేలం ద్వారా వచ్చే ఆదాయంతో నిర్వహణ జరుగుతుండేది. కొలిమిగుండ్ల లక్ష్మీనరసింహస్వామి ఆలయం, కల్వటాలలోని ఆంజనేయస్వామి ఆలయంతో పాటు పలు ఆలయాలకు మాన్యం ఉంది. రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీకి మైనింగ్ లీజులో రెండు గ్రామాల్లోని ఆలయాలకు చెందిన 80 ఎకరాల మేర దేవదాయ భూములు ఉన్నాయి. దీంతో కంపెనీ ఈ భూములను స్వాధీనం చేసుకొని బదులుగా భూమిని మరొక గ్రామంలో ఇస్తామని దేవదాయ ఉన్నతాధికారులకు రిక్వెస్ట్ పెట్టుకున్నారు. సిమెంట్ ఫ్యాక్టరీ నిర్ణయంతో ఆయా గ్రామాల పెద్దలు, రైతులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. భూమికి బదులు భూమిని ఇతర గ్రామంలో కాకుండా స్థానికంగానే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఆలయ భూములు ఏటా వేలం పాట నిర్వహించడంతో సన్న, చిన్న కారు రైతులు వివిధ రకాల పంటలు పండించుకుంటున్నారు. ఇప్పుడు ఇతర గ్రామంలో ఇస్తామని చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్కడ భూమి కేటాయించాక భూముల వేలంలో పాల్గొన్న రైతులు వేరే గ్రామానికి వెళ్లి వ్యవసాయం చేయడం అంత సులభం కాదని వాపోతున్నారు. సిమెంట్ ఫ్యాక్టరీ ప్రతినిధులు ఇప్పటికే ఇటిక్యాలలో ఫ్యాక్టరీకి చెందిన భూముల్లో యంత్రాలతో కంపచెట్లు తొలగించారు. అయితే ఇటిక్యాలకు చెందిన రైతులు, వేరే గ్రామాలకు చెందిన రైతులు ఇక్కడికి వచ్చి పంటలు ఎలా పండిస్తారు అని.. మేమే భూములు సాగు చేస్తామని చెబుతున్నట్లు సమాచారం. రెండు గ్రామాల్లో మాన్యం భూములు చాలా విలువైనవని రైతులు పేర్కొంటున్నారు. ఏ గ్రామంలోని ఆలయ భూములకు బదులుగా ఆ గ్రామంలోనే సిమెంట్ ఫ్యాక్టరీకి చెందిన భూములు ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈవిషయంపై రైతు సంఘం, సీపీఐ నాయకులు సైతం కొద్ది రోజుల నుంచి ఆందోళన చేస్తున్నారు.



కల్వటాల సమీపంలోని ఆలయ భూమిలో సాగు చేసిన జొన్న పంట

స్థానికంగానే ఇవ్వాలి



దేవాలయ భూములను సిమెంట్ ఫ్యాక్టరీకి ధారాదత్తం చేస్తే గ్రామాల్లో కూలీలకు ఉపాధి కోల్పోతారు. ఫ్యాక్టరీకి చెందిన భూములు స్థానికంగానే ఉన్నాయి. ఆ ఊర్లలోనే ఇస్తే రైతులు వేలం ద్వారా పంటలు పండించుకునేందుకు సులభంగా ఉంటుంది. ఇతర గ్రామంలో భూమి ఇస్తే అక్కడికి పోయి భూమి సాగు చేయడం అంత సులభంగా ఉండదు. వీటిపై ఉన్నతాధికారులు సరైన నిర్ణయం తీసుకొని స్థానికంగానే ఇవ్వాలి, లేని పక్షంలో ఆలయ భూములను బదలాయింపు చేయరాదు.

–పుల్లయ్య, రైతు సంఘం మండల అధ్యక్షుడు

కూటమి పాలనలో ప్రజలకు కష్టాలే

డోన్ టౌన్: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో కార్పొరేట్ శక్తులకు వరాలు, పేద ప్రజలకు కష్టాలు వచ్చాయని సీపీఎం నాయకులు విమర్శించారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో కూటమి పాలనపై రాష్ట్ర కమిటీ విడుదల చేసిన బుక్‌లెట్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, కమిటీ సభ్యులు చిన్నరహీమ్, భాస్కర్‌రెడ్డి, రామాంజనేయులు, నాగమద్దయ్య, శివరాం, ఆశోక్, షమీమ్ బేగం తదితరులు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలను ప్రభుత్వం అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ప్రజావ్యతిరేక పాలనపై పోరాడేందుకు అన్ని ప్రజాస్వామ్య పార్టీలు ఒకతాటిపైకి రావాలని కోరారు. నాయకులు ఉసేన్‌పీరా, సురేష్, మస్తాన్, మాధవి, భూలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

మద్దిలేటిస్వామికి విశేష పూజలు



స్వామివారికి మహామంగళహారతి ఇస్తున్న అర్చకులు

బేతంచెర్ల: మండల పరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో తొలి ఏకాదశిని ఘనంగా నిర్వహించారు. ఆలయ ఉప కమిషనర్, ఈఓ రామాంజనేయులు, వేదపండితులు జ్వాలా చక్రవర్తి, కళ్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక పుష్పాలంకరణ, మహా మంగళహారతి నిర్వహించారు. ఆదివారం నుంచి నాలుగు నెలల పాటు కార్తీక శుద్ధ ఏకాదశి వరకు యోగ నిద్రలోకి వెళ్లే క్రమంలో ఆలయంలో శయన భంగిమలో స్వామివారి ఉత్సవమూర్తిని కొలువుంచి పూజలు చేశారు.

ప్రమాదకర మలుపు



బెలుం గుహల సమీపంలోని మలుపు ప్రమాదకరంగా మారింది. ఎదురెదురుగా వాహనాలు ప్రయాణించే సమయంలో కనిపించక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మలుపు చెంతనే కుంటతో పాటు చెట్లు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి. ప్రమాదం పొంచి ఉందని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. అనంతపురం-అమరావతి జాతీయ రహదారి కావడంతో ఈమార్గంలో వాహనాలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. మలుపు సమీపంలో చెట్లను తొలగించి వాహనాలు కనిపించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

–కొలిమిగుండ్ల

ప్రభుత్వ కార్యాలయాలే నివాసం



రోడ్ల మీద, వీధుల్లో సంచరించే పందులు ఏకంగా ప్రభుత్వ కార్యాలయాల వద్దే మకాం వేశాయి. మండల కేంద్రం కొలిమిగుండ్లలో తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, వెలుగు, ఉపాధి హామీ పథకం, ఎమ్మార్సీ కార్యాలయాలతో పాటు గ్రామ సచివాలయం, రైతు సేవా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లీనిక్ కార్యాలయాలు ఒకే చోట ఉన్నాయి. ఇక్కడ పరిసరాలు అన్నీ అపరిశుభ్రంగా మారాయి. పందుల గుంపు తహసీల్దార్ కార్యాలయం ప్రహరీ గోడ చెంతనే సేద తీరుతున్నాయి. వివిధ పనుల కోసం కార్యాలయాల వద్దకు వచ్చిన ప్రజలు పందుల గుంపును చూసి నివ్వెరపోతున్నారు. అధికారుల ఇదే మార్గంలో రాకపోకలు సాగిస్తున్నా కార్యాలయాల వద్దే పందులు స్వేచ్ఛగా తిరుగుతున్నాయని ప్రజలు చర్చించుకున్నారు.

–కొలిమిగుండ్ల